## 11

# మేడే

**'బాతాల పోశెట్టి' పేరిట రాసిన కాలమ్స్**

"ఎటుబోయినవుర? మూర్రోజుల్నుంచి కనపడ్తలేవు. గీ ఉత్తురం రాత్తవేమోనని సూసుకుంటజేర్తె"

"మా అక్క కొడుకు సత్తిగాన్ని పోలీసులు పట్టుకపోయిర్రని మతలబత్తె జరూరుగ ఉరికిన"

"పోరగాన్లకు సోకు సోకు బట్టలు గావన్నాయె. సికిలేట్లు, పాన్‌విడాలాయె, ఎక్కతక్క మాట్లాడ్తె బీరు బరండీలు తాగవట్టిరి. ఇగ ఎక్కడి పైసలు జాల్తయి నడిబజాట్ల అన్ని కనవడ్డంక పోరగాన్లకు ఊకుండబుద్దయితాది పోరగాన్లను పట్టుకుంటేమత్తది? ఇసోంటి దుకాన్లన్ని బంజేపియ్యాలె అసల్".

"అంటే ఆడు దొంగతనం జేసిండంటవు?"

"దొంగతనం గాకపోతే లంజెతనం జేసిందుగావచ్చు. ఎవతిని గుంజిండో ఏమో? గసొంటి గిసొంటి సీనిమ్మలు జూసినంక వయసుమీదున్న ఏ పోరడాగుతడు? గీల్లను పట్టుకుంటె ఏమత్తది? అసల్ గిసొంటియి తీసుడు బంజేపియ్యాలెరా? వానియవ్వ సీనిమ్మల..."

"అంటె ఆడెవల్నో గుంజిండంటవు?"

"లేకపోతే ఉత్తగెందుకు పట్టుకపోతర్రా? బాగదాగి ఎవలనన్న పొడిసిండోమన్నో! ఏ సీనిమ్మల జూసినా కసకస పొడుసుకునుడేనాయె."

"నీయవ్వ! నూతిలవడ్డోనిమీద నూర్రాల్లు అని గందుకే అన్నారు. ఇటేడు పిడంతరాలు – అటేడు పిడంతరాలు గసొంటి గునాల్లేవు మాయింట్ల. సొక్కం బంగారమసొంటి గునం మావోన్ది."

"ఔ! ఔ! సొక్కం బంగారాన్ని ఒలుసుకోని సొమ్ములుసేసుకుందామని పట్టుకపోయిర్రుగాదుర?"

"నీయవ్వ! పీకు ఈన్నుంచి! మూఁరోజుల్నుంచి అటిటు దిరిగి యాట్టకచ్చింది. సప్పుడుజేక తినిపంటవనుకుంటే అచ్చి ఓ సోదివెట్టినావు!'

"అసలేమైందిర? మరి"

"బంగారమసొంటి పోరన్ని తోల్లూడగొట్టిఁను".

"గిదేమాట నేనంటే తప్పని పీకు పీకంటివి. నువ్వంటే తప్పుగాదులే? అసలు ఎందుకు వట్టుకపోయినట్టురా?"

"తాతీల్లల్ల నలుగురైదుగురు పోరగాన్లు గలిసి కొన్ని ఊర్లు దిరుగుదామని బయిలెల్లిఁనట. ఆడీడ కొన్ని పాటలు వాడిఁనట."

"పురుగు-బూసుదిని పుట్టలుండక గిదేంపనిర? మంది కండ్లల్ల"

"గిదేముచ్చట మీ అల్లునికి చెప్పక పోయినావు? మల్ల ఉత్తరం రాపిత్తాని ఎందుకచ్చినవు... ఎవలిష్టంవాల్లు. తనకు తోసింది ప్రచారం జేసుకోవచ్చు. మనకు వోటేసుటానికి ఎంత హక్కున్నదో గట్ల ప్రచారం జేసుకునుటానికి గంత హక్కున్నది మన రాజ్యాంగమ్ల".

"మరెందుకు వట్టుకున్నట్టు యిగ?"

"ప్రజలను రెచ్చగొడుతున్నరని"

"గట్లయితే గీ సీనిమ్మలు తియ్యనిచ్చెటోల్లను, గీ కల్లు బీరుబరండీలను అమ్మనిచ్చెటోల్లను జేల్లెయ్యాలె ముందుగాల"

"గదేముచ్చట పోరగాన్లు చెప్పిఁను. పైసలు కర్చుపెట్టుకున్నోడే గెల్చే రాజ్యంల మల్లగా పైసలు సంపాయించుటానికి దోసుకుంటజేర్తరు. గందుకని ఓట్లతోటి రాజ్యం మారది. మన బతుకు మారది. దున్నెటోనిదే భూమి. రైతు కూలి రాజ్యం రావాలంటె దొరలకు - సర్కారుకు ఎదురుతిరగాలె అని చెప్పిఁను".

"అట్లయితేఁ! మంచి ముచ్చట్లే జెప్పిఁనుమరి!"

"అయితే "రాజద్రోహం" నేరం జేసిఁనని పోలీసులు వట్టుకపోయిఁను."

"అగో! గట్లెట్ల? మనిట్టం! ఏది వడ్తె అది ప్రచారం సేసుకోవచ్చంటివి గదర?"

"గట్లన్నది నిజమేగని ప్రజల్ని రెచ్చగొడ్తె జేల్లెయ్యమని అన్లనే వేరేకాడ రాసున్నది".

"గట్లెట్లర? మనం గిది అన్నాలం అని తెలజెప్పినంక యిన్నోడు మట్రవడక ఊకుంటడామరి?"

"ఊకోడు నిజమేగని. పట్టుక పోవుడుగుడ నిజమేనే"

"ఓర్నియక్క! గిదేందిర? ప్రచారం జేసుకోవచ్చుంటవు – సేత్తె పట్టుక పోవచ్చుంటవు? గిదేం సర్కార్రో?"

"సర్కారుగాదె రాజ్యాంగం. అదాలత్‌ల కేసువెట్టిన్రు?'

"పెడ్తెవెట్టనిగని వారంరోజులు పొట్టుపొట్టు గొట్టిరి గదనె?"

"పట్టుకవోయినోల్లు కొట్టకుంట ఊకుంటారుతియ్యి"

"గట్ల ఈల్లే గొట్టినంక – సంపినంక గీ అదాలతులెందుకు? వకీల్లెందుకు? పీకిపారెయ్యాలె! తిండికిలేక ఉపాసం సత్తె అడిగే మొకంలేదుగని ... వానయ్య జాగిరా? తాత జాగిరా, కన్నరా, పెంచిన్రా? కొట్టుటానికి"

"పట్టుకున్నంక ఒక్కరోజుకంటె ఎక్కొ వుంచుకోవద్దని – అదాలత్‌కు పంపాల్నని వాని కానూన్లనే రాసుకున్నడని ఎక్కన్నో సభల యిన్నట్టున్నరా".

"రాసినయన్ని సేసుటానికా? మనను నమ్మిచ్చుటానికిగని. అన్లగూడ నాసా అంట వేరే కానూన్లు తీసిన్రు. ఎందుకు పట్టుకుపోయిన్రో సెప్పకుంట నెలలకాన జేల్లవెట్టచ్చు".

"గిదే కానూను గాదుర నా అల్లుని యిల్లువుచ్చుకున్నది"

"నీ అల్లున్ని జేల్లేసింది నాసా కిందగాదే.. ఎస్మా కింద!"

"గీ ముచ్చట్లన్ని బజార్ల బట్టిడిసినట్టు కనవడంగ ఎట్లూకుంటందిర లోకం?"

"గిసొంటియి సెవులవడద్దనే సర్కారు ప్రేమపెండ్లి సినిమాలు, కసకస పొడుసుకునుడు సినిమాలు తియ్యనిస్తది. తంతె పడాలెగని మట్రవడద్దని గాంధీ సినిమా తీపిస్తది. ఆసియా ఆటలంటది, ఆకాశంల ఉపగ్రహాలంటది. ఉత్తరధృవం ప్రయానమంటది. హిందూముస్లిం కొట్లాటంటది. పాకిస్తాన్‌తోటి యుద్ధం వచ్చెనంటది... అని అదీ ఇది జెప్పి మరిపిస్తది"

"ఓర్నీయక్క! ఎన్ని వలలేత్తదిరో సర్కారు!"

"ఇవన్ని వలలు తప్పిచ్చుకోని ఎవలన్న తెలివిమంతుడు తెలుసుకొని తెలజెప్పితె అన్నోన్ని - యిన్నోన్ని యిద్దర్ని జేల్లేత్తది. దిక్కున్నకాడ చెప్పుకపొమ్మంటది".

"అదాలతుల్లేవుర?"

"అదాలతులు ఆల్లువెట్టినయేనాయె. అవి మనుషుల నమ్మది - పైసల నమ్ముతది. పైసున్నోడు దప్ప యింకోడు గెల్వకుంట వాడువెట్టిందేనాయె."

"ఓర్నీ! పైసను మనం పుట్టిచ్చినమా? మనను పైసపుట్టిచ్చిందా? గట్లెట్లరా?"

"లేకపోతే గీ మూర్రోజులెందుకు తిరుగుదునే? జమానతుమీద ఆల్లను యిడిసి పెట్టుమంటె నాకు యిరువైవేల జాయిదాదుఉంటెనే నా జమానతు ఒప్పుకొంటాన్నరు. ఇటు పట్వారిని - గిర్దావరిని కల్సి ఆ సర్టిఫికేటు దీసికొని యిడిపిట్టెటాల్లకు మూర్రోజులాయె."

"ఔగని ఒకోసారి సర్కారు గుడ మంచి పనే జేత్తదిరా... మొన్న యింద్రగాంధి ఎన్టిరాంరావుగుడ ఏదో పండుక్కు పని పాటలోల్లకు బవుమతులిచ్చిన్రటగదర? పనిపాటలోల్లందరు ఒక్కటిగావాలె. సల్లగబతుకాలెనని అన్నరటగదర! ఎంతైన కడుపుల కొద్దిగనన్న ప్రేమ లేంది గివన్నిజేత్తార్ర?"

"ఏది? గా "మేడే' ముచ్చటంటున్నావే? జీతాలు వెరుగాల్నంటె కార్మికులంత ఒక్కటై సమ్మెజెయ్యాలన్నందుకేగాదె మీ అల్లున్ని జేల్లేసింది."

"ఔనెంర! మొగన్ని గొట్టమొరమొరో అన్నట్టున్నదెంర?"

"గట్లగాదే నువ్వు మ్యాకను గంత ప్రేమగ ఎందుకు జూత్తున్నవే?"

"ఈని పిల్లలువెద్దె పెరిగినంక అమ్ముక తినుటానికి"

"మరి నీకు దేనిమీద ప్రేమున్నట్టే? మ్యాకమీదనా దాన్నమ్ముతె అచ్చె పైసమీదనా?"

"ఓర్నియక్క! నేను యిన్నిరోజులు నాకు మ్యాక మీదనే ప్రేమున్నదనుకున్నరో! నువ్వన్నది నిజమేరో! అయితే యింద్రగాంధి ఎన్టిరాంరావు సూపిచ్చే ప్రేమగూడ గిసొంటిదే అంటవు. మరి ఎవలది నిజంరా"

"కార్మికుల, రైతుకూలీల రాజ్యం గావాల్నని ఎదురునిలవడి కొట్లాడెటోడు జరిపే మేడే నిజమైనది. మిగతోల్లు జరిపేటియి నక్కెత్తులు. నేనుగూడ మీవోన్నెఅని నమ్మిచ్చుటానికి"

"అయితే ఈ సర్కారు ఏదిజేసినా నమ్మిచ్చి గొంతుగోసుటానికేనంటవు. ఈ కానూన్లు గూడ గందుకే అంటవు. గందుకే హక్కుల్ని బువ్వసేత యిచ్చినట్టే యిచ్చి పుర్రసేత గుంజుకుంటదంటవు."

"లేకపోతే నీ అల్లున్ని – మా అల్లున్ని జేల్లేసినోల్లె ప్రపంచ కార్మిక దినోత్సవం వర్ధిల్లాలంటె దొంగనే దొంగ దొంగ అని ఒర్రినట్టు గాద!"

"అయితే అల్లునికి ఉత్తరం మంచిగ రాయిర"

**'చాటింపు' పక్ష పత్రిక 1983**